రాజకీయ పరిణామాలపై అధ్యయనం చేయాలి

సదస్సులో పాల్గొన్న వక్తలు

బేగంపేట్ ఫిబ్రవరి 9: ఎమర్జింగ్ డైమెన్షన్స్ ఇన్ ఇండియా పాలిటిక్స్ అనే అంశంపై బేగంపేట్ మహిళా డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సును శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి అధ్యక్షతన నిర్వహించారు. హైదరాబాద్ రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఉస్మానియా వీసీ రవీందర్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భారత రాజకీయాల్లో వస్తున్న పరిణామాలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సు నిర్వాహకులు డాక్టర్ రామచారి, కమల, నర్సింగ్‌లను వారు అభినందించారు. విద్యా సాధనలోనూ విద్యార్థి ఉపాధి కల్పనలోనూ బేగంపేట్ మహిళా డిగ్రీ కళాశాల ప్రత్యేకత కలిగి ఉందన్నారు.

బీజేపీని పటిష్టం చేయాలి

సికింద్రాబాద్: బీజేపీ బూత్ అభ్యాన్ కార్యక్రమంలో భాగంగా కమిటీలను పటిష్టం చేస్తున్నట్లు శుక్రవారం బూత్ నంబర్ 156 కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఇన్‌చార్జి పార్థసారథి అన్నారు

'గృహజ్యోతి'కి వివరాలు సేకరణ

తెల్ల రేషన్‌కార్డుదారులే అర్హులు

బేగంపేట్/అడ్డగుట్ట/సికింద్రాబాద్, ఫిబ్రవరి 9: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను వాడుకునే వారికి ఉచితంగా అందించేందుకు విద్యుత్ శాఖ అధికారులు లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. శుక్రవారం విద్యుత్ శాఖ డీఈ ఆదేశాల మేరకు సూపరిడెండెంట్ రవికుమార్, ప్యారడైజ్ సర్కిల్ ఏఈ రామకృష్ణ బేగంపేట్ సర్కిల్ పరిధిలో పాల్గొని ఉచిత విద్యుత్ వివరాల సేకరణపై స్థానికులకు అవగాహన కల్పిస్తూ వివరాలు సేకరిస్తున్నారు.

కొనసాగుతున్న గృహజ్యోతి సర్వే

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ అడ్డగుట్ట, మెట్టుగూడ డివిజన్‌లలో చురుకుగా కొనసాగుతున్నది. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను ఎంపిక చేసే పనిలో నిమగ్నమయ్యారు. అర్హులైన వారి నుంచి రేషన్‌కార్డు, పాన్ కార్డు, ఆధార్ కార్డు, విద్యుత్ బిల్లు నంబర్లను అందజేయాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.

'గృహజ్యోతి'దరఖాస్తు ఫారాలు పరిశీలన

పేదల కోసం ప్రవేశపెట్టనున్న గృహజ్యోతి పథకం దరఖాస్తులను అధికారులు స్వీకరిస్తున్నారు. దానిలో భాగంగా శుక్రవారం బౌద్ధనగర్ డివిజన్ పరిధిలోని స్థానిక జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయం, వారాసిగూడ అంబర్ నగర్‌లోని బాల్వాడి స్కూల్, లలితానగర్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన గృహజ్యోతి పథకం దరఖాస్తు ఫారాలను కార్పొరేటర్ శైలజ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. తెల్లరేషన్ కార్డ్‌లు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉండి దరఖాస్తులను తీసుకోవాలని సూచించారు.

సికింద్రాబాద్: గృహ జ్యోతి పథకం దరఖాస్తు ఫారాలను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ శైలజ

అడ్డగుట్ట: మెట్టుగూడలో..

బేగంపేట్: రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో అంబేద్కర్ నగర్‌లో ..

ఎంచుకున్న రంగాల్లో .. రాణించడం శుభపరిణామం

'మీడియా స్ఫియర్ - 2024' కార్యక్రమంలో వక్తలు

ప్రతిభ చాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అతిథులు

అమీర్‌పేట్, ఫిబ్రవరి 9: మారుతున్న పరిస్థితుల్లో మహిళలు మాస్ కమ్యూనికేషన్స్, ఫిలిమ్ స్టడీస్‌లను తమ కెరీర్‌గా ఎంచుకోవడం శుభ పరిణామమని సినీ దర్శకుడు బుచ్చిబాబు సాన పేర్కొన్నారు. తాము ఎంచుకున్న రంగాల్లో విద్యార్థులు విజయవంతంగా దూసుకుపోతున్న తీరు అభినందనీయమన్నారు. బేగంపేట్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాలలోని మాస్ కమ్యూనికేషన్, జర్నలిజం విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల ఆడిటోరియంలో 'మీడియా స్ఫియర్ – 2024' విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో దాదాపు 700 మంది పైగా విద్యార్థులు పాల్గొన్నారు. మాస్ కమ్యూనికేషన్, జర్నలిజానికి సంబంధించి మొత్తం 8 విభాగాలకు నిర్వహించిన పోటీల్లో 10 బృందాలు పాల్గొన్నాయి. 'మీడియా స్ఫియర్ – 2024' ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ గాయని మంగ్లీ, గాయకుడు, సంగీత దర్శకుడు రామ్ మిరియాలలు తమదైన సంగీతం, పాటలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో ఐ న్యూస్ సీఈవో స్వాతిరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమా జోసెఫ్‌లు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 9: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ గగన్‌పహాడ్ మామిడికుంట, అప్పచెరువులను రాజేంద్రనగర్ ఆర్డీవో మల్లయ్య, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ రవికుమార్, ఇరిగేషన్ అధికారి నారాయణ, ఈఈ నరేందర్, డీఈ విశ్వంతో కలిసి అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి శుక్రవారం చెరువులను సందర్శించి పరిశీలించారు. చెరువులలో వెలుస్తున్న ఆక్రమణలు, మట్టి కుప్పలను తొలగించాలని, చెరువు స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలని అధికారులకు ఆదేశించారు.

నాణ్యమైన విద్యను అందించాలి

విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని సికింద్రాబాద్ మండలం డిప్యూటీ విద్యాధికారి ఎస్ చిరంజీవి సూచించారు. శుక్రవారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని సుభాష్ రోడ్డులో ఉన్న సెయింట్ ఆంథోని బాలికల పాఠశాల 72వ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి. విద్యార్థులంతా ఆటపాట, నృత్యాలతో హోరెత్తించారు. – బేగంపేట్ ఫిబ్రవరి 9:

అక్రమ కట్టడాలు లేకుండా చూడాలి: డిప్యూటీ మేయర్

సికింద్రాబాద్,ఫిబ్రవరి 9: నగరంలో అక్రమ కట్టడాలు లేకుండా కృషి చేయాలని డిప్యూటీ మేయర్ ఆదేశించారు. శుక్రవారం బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డితో కలిసి ఆమె తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోన్ టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ..నగరాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్మించడంలో టౌన్ ప్లానింగ్ అధికారులు కృషి చేయాలన్నారు. అదేవిధంగా అక్రమ కట్టడాలపై తగ్గిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ రజిత , సైట్ ఇన్ స్పెక్టర్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి

అమావాస్య సందర్భంగా అన్నదానం

అమావాస్య సందర్భంగా వారాసిగూడ ఆర్యవైశ్య సంఘం నాయకులు శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఆ సంఘం అధ్యక్షుడు బెలిదె నర్సింహారావు హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వారాసిగూడ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి కే.సుధాకర్,కోశాధికారులు పి.మధుకర్,నారాయణ,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. – సికింద్రాబాద్, ఫిబ్రవరి 9

సమస్యలను పరిష్కరించాలి

సికింద్రాబాద్, ఫిబ్రవరి9 :సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్ అధికారులను కోరారు. నియోజకవర్గ పరిధిలోని బౌద్ధనగర్, తార్నాక, సీతాఫల్‌మండి,మెట్టుగూడ,అడ్డగుట్ట తదితర డివిజన్‌లలో అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరించాలన్నారు. అదేవిధంగా సీసీ రోడ్లు, మంచినీటి పైపులైన్లతో పాటు పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని శుక్రవారం జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ రవి కిరణ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తార్నాక డివిజన్ ప్రెసిడెంట్ బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని జడ్సీకి వినతి పత్రం ఇస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

సికింద్రాబాద్ నుంచి అయోధ్యకు ప్రత్యేక రైలు ప్రారంభం..

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో అయోధ్యకు వెళ్లే ప్రయాణికులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ ప్రభాకర్, రాష్ట్ర నాయకుడు మల్క కొమురయ్య

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 9: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి అయోధ్య వరకు భారతీయ రైల్వే ఏర్పాటు చేసిన సాలార్‌పూర్ ప్రత్యేక రైలును శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ ప్రభాకర్, బీజేపీ రాష్ట్ర నాయకులు మల్క కొమురయ్యలు జెండా ఊపి ప్రారంభించారు. అయోధ్యకు రైల్లో వెళ్లే సుమారు 1500 మంది భక్తులకు మల్క కొమురయ్య స్నాక్స్, దుప్పట్లు, అయోధ్య పోస్టర్లను అందజేశారు. శ్రీరామ నామస్మరణతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంగణమంతా మర్మోగింది. బాల రాముని దర్శనం కోసం రైల్వే శాఖ అన్ని రకాల ఏర్పాట్లు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న సమ్మక్క-సారక్క జాతరలో భాగంగా సికింద్రాబాద్‌లో మోండా మార్కెట్ ప్రాంతంలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడానికి తమ పిల్లల నిలువెత్తు బంగారం(బెల్లం)ను కొనుగోలు చేస్తున్నారు.

దాడికి పాల్పడిన భార్య.. మరో ముగ్గురిపై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 9: కుటుంబ కలహాల్లో భాగంగా తనను ఇంట్లోంచి వెళ్ల గొట్టేందుకు ప్రయత్నించడంతో పాటు దాడికి పాల్పడిన భార్యతో పాటు బావమరుదుల మీద చర్యలు తీసుకోవాలని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్ నం.13లోని అంబేద్కర్‌నగర్ బస్తీకి చెందిన గుండప్ప(47) కూలీ పనులు చేస్తుంటాడు. భార్య లక్ష్మితో కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. దాంతో ఇంట్లోంచి వెళ్లిపోవాలని లక్ష్మి చెప్పడంతో సమీపంలోనే ఉంటున్న తన తమ్ముళ్లు గోవింద్, బాలాజీలను పిలిచింది. ఈ క్రమంలో వారి మధ్యన గొడవ చోటు చేసుకోవడంతో గోవింద్, బాలాజీలు గుండప్పపై దాడి చేశారు. భార్య లక్ష్మి వేడివేడి స్పూన్‌తో ముఖంపై వాత పెట్టింది. దీంతో తీవ్ర గాయాల పాలైన బాధితుడు శుక్రవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రాము హంతకులను కఠినంగా శిక్షించాలి

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 9: నగరంలోని ఎల్ఎన్‌నగర్‌లో రియల్టర్ సింగోటం రాము ముదిరాజ్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్య దర్శి సలేందర్ శివయ్య ముదిరాజ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హిమాయత్‌నగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం ఫౌండేషన్ పేరుతో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న రాముపై దుండగులు కత్తులతో దాడి చేసి హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. రాజకీయంగా ఎదుగుతున్న ముదిరాజు కుల స్తులను హత్యా రాజకీయాలతో అడ్డుకోలేరని, ప్రభుత్వం స్పందించి నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతుడు రాము కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.

అంగన్‌వాడీల హామీలు అమలు చేయండి

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 9: కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, ప్రధాన కార్యదర్శి బాలరాజు, జాతీయ నాయకురాలు డాక్టర్ బి.వి.విజయలక్ష్మి, ఉమెన్ ఫోరం అధ్యక్షురాలు పి.ప్రేం పావని, సీపీఐ నగర కార్యదర్శి ఎస్.ఛాయ దేవి, డిమాండ్ చేశారు.

మొక్కలను సంరక్షించుకోవాలి

సికింద్రాబాద్,ఫిబ్రవరి 9:ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని వృక్షశాస్త్రానికి చెందిన పూర్వ విద్యార్థుల విభాగం ఆధ్వర్యంలో సదస్సు జరిగింది.గత మూడు రోజులు నిర్వహించబడిన 'సుస్థిర భవిష్యత్తు కోసం మొక్కల శాస్త్రంలో పురోగతి' అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సు ఒక చారిత్రాత్మక కార్యక్రమం శతాబ్ది సంవత్సరానికి నాంది పలికింది. ఈ కార్యక్రమం శుక్రవారం రాత్రి ముగిసింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ ఎస్.కె. మహమూద్, వైస్ చైర్మన్, విద్యార్థులు , యువ శాస్త్రవేత్తలు పాల్గొనడానికి ,సమాజానికి వారి పరిశోధనలను ప్రదర్శించడానికి వేదికను ఏర్పాటు చేసిన ఆర్గనైజింగ్ కమిటీని ఆయన అభినందించారు. తెలంగాణ రాష్ట్రంలోని వృక్షజాలం గొప్పతనాన్ని వివరించారు.దానిని రక్షించడం, సంరక్షించడం అత్యవసరమని చెప్పారు. ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ .....వివిధ వ్యాధులు, రుగ్మతుల నివారణలో ఔషధ మొక్కలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల ప్రొఫెసర్లు , విద్యార్థులు పాల్గొన్నారు.

సౌండ్ పొల్యూషన్‌కు పాల్పడితే కఠిన చర్యలు

బేగంపేట్ ఫిబ్రవరి 9: బైకులకు పెద్ద శబ్దంతో సౌండ్ పొల్యూషన్‌కు పాల్పడుతున్న ద్విచక్ర వాహనాలపై ఉత్తర మండలం పోలీసులు ఉక్కుపాదం మోపారు. బైకులకు భారీ శబ్దాలు చేసే సైలెన్సర్‌లను ఊడదీసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉత్తర మండలం పరిధిలో 6 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టి శబ్ద కాలుష్యానికి పాల్పడుతున్న 130 మంది బైక్ రైడర్లను పట్టుకున్నారు. ఈ క్రమంలో బేగంపేట్‌లోని ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో బైక్ రైడర్‌లకు ట్రాఫిక్ ఉన్నతాధికారులు డీసీపీ సుబ్బరాయుడు, రంగారావులు కౌన్సెలింగ్ నిర్వహించారు. వాహనాలకు ఉన్న సైలెన్సర్‌లను తొలగించి వాహనదారులపై కేసులు నమోదు చేశారు. వాహనాలకు సైలెన్సర్లను మార్చే మెకానిక్‌లపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్లు పాపయ్య, మధుబాబు, నాయక్ పాల్గొన్నారు.

బేగంపేట్ ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో వాహనాలకు తొలగించిన సైలెన్సర్లు..వాహనదారులకు కౌన్సెలింగ్ చేస్తున్న ట్రాఫిక్ అధికారులు

అందుబాటులో ఉండి సేవలందించండి

- నార్సింగి మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్
- 2024-25 అంచనా వ్యయం బడ్జెట్ రూ.192కోట్లు

మణికొండ, ఫిబ్రవరి 9: ప్రజా ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిధులను సక్రమంగా వినియోగించేందుకు చొరవచూపాలని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశాన్ని శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ దారుగుపల్లి రేఖ యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మున్సిపాలిటీలో ప్రవేశపెట్టిన రూ.192 కోట్ల అంచనా వ్యయ నిధుల వెచ్చింపులపై ప్రజాప్రతినిధులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యతను బట్టి నిధులను వెచ్చించేందుకు ప్రజాప్రతినిధులు చొరవచూపాలని సూచించారు. నగర శివారు ప్రాంతంలోని మున్సిపాలిటీలల్లో అత్యధికంగా నిధులు ఉండటంతో ఈ ప్రాంతాలు నగరానికి దీటుగా అభివృద్ధి చెందుతున్నాయని అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. ఈ సందర్భంగా బడ్జెట్ వివరాలను మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి సమావేశంలో వెల్లడించారు. 2024-25 ఏడాదికిగాను మున్సిపాలిటీ పన్ను ఆదాయం రూ.3522.09లక్షలు, అద్దె/పెనాల్టీ ఆదాయం రూ.327.25లక్షలు, టౌన్‌ప్లానింగ్ ఆదాయం రూ.4700.00 లక్షలు, ట్రేడ్ లైసెన్సు/పెనాల్టీల ఆదాయం రూ.327.25 లక్షలు, ఇంజనీరింగ్ విభాగం ఆదాయం రూ.10.80లక్షలు, డిపాజిట్లు రూ.470.00 లక్షలు, నాన్ ప్లాన్ గ్రాంట్లు రూ.180.00లక్షలు, ప్లాన్‌గ్రాంట్ రూ.05.00 లక్షలు, ఇతర గ్రాంట్లు రూ.40.00 లక్షలు, మొత్తం ప్రారంభపు విలువ రూ.9363.26 లక్షలుగా ఉన్నట్లు తెలిపారు. 2024-25 ఏడాదిగాను మున్సిపాలిటీ నుంచి రూ.1920 1.40లక్షలు (అక్షరాల నూట తొంభైరెండు కోట్ల ఒక లక్ష నలభై వేలు) బడ్జెట్‌ను అంచనా వ్యయంగా టార్గెట్ పెట్టుకున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానిస్తున్న ప్రజాప్రతినిధులు

విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

కుష్టు వ్యాధిపై అవగాహన

సికింద్రాబాద్,ఫిబ్రవరి 9: కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కుష్టు వ్యాధిపై శుక్రవారం హైదరాబాద్ జిల్లా అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ (ఎయిడ్,లెప్రసీ)అధికారి నిర్మలా ప్రభావతి ఆధ్వర్యంలో సీతాఫల్‌మండి కుట్టి వెల్లోడి పరిధిలోని నెహ్రూ హైస్కూల్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు ప్రదీప్‌కుమార్,జ్యోతి శ్రీ,అజ్మీరా రమేష్‌నాయక్, నాగరాజు, దీప, సరిత, లావణ్య, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

బోయిగూడలో.. గ్యార్వీ

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 9 : న్యూబోయిగూడలోని ఆరోగ్య కేంద్రం సమీపంలో ఉన్న మహబూబ్ సుభానీ చిల్లా వద్ద గ్యార్వీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు హాజరయ్యారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు, అన్నదానం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు రజాక్, లక్ష్మీపతి, లంకరాజు, అబ్బాస్, వెంకట్‌లు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యకు యూజీసీ గుర్తింపు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 9: నాణ్యమైన విద్యనందించినందుకు తమకు యుజీసీ గుర్తింపు వచ్చిందని పల్లవి ఇంజినీరింగ్ కాలేజ్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.నవీన్ కుమార్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పల్లవి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ గత 30 ఏండ్లుగా వేలాది మంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దామన్నారు.